
కరీమాబాద్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

# మహాసభను జయప్రదం చేయాలి

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

కరీమాబాద్/పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ 33వ డివిజన్‌లో ఏరుకొండ సురేశ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎల్కతుర్తిలో జరగనున్న సభకు ప్రజలు తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోడెం ప్రవీణ్, మనెక్క, గద్దల రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, నన్నపునేని అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని 32వ డివిజన్ బీర్లకుంటలో నిర్మించిన బొడ్రాయి వార్షికోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోగాకు సందీప్, నాయకుడు మోడెం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ మహాసభను ప్రతి కార్యకర్త పండుగలా జరుపుకోవాలని నన్నపునేని పిలుపునిచ్చారు. వరంగల్ 22వ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకుడు మావురపు విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార వాల్ పోస్టర్లను నాయకులు, కార్యకర్తలతో కలిసి నన్నపునేని ఆవిష్కరించారు.

# ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు

**కలెక్టర్ సత్యశారద**


ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, ఏప్రిల్ 10: యాసంగి ధాన్యం కొనుగోలు సంబంధించి ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ, సహకార శాఖల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, హార్వెస్టర్ యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలో ఈ యాసంగిలో సుమారు 2.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 182 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కోతలను దశల వారీగా చేపడితేనే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం దశల వారీగా వచ్చే అవకాశం ఉందన్నారు. వరి పంట పూర్తిగా ఎండిన తర్వాతే కోతలు చేపట్టాలని హార్వెస్టర్ల యజమానులకు సూచించారు. హార్వెస్టర్ యంత్రాలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 18 నుంచి 20 ఆర్పీఎం వద్ద నడిచేటట్లయితే కొంతవరకు తాలును నివారించొచ్చన్నారు. క్షేత్రస్థాయిలో ఏఈవోలు, ఏవోలు వరి కోతలను నియంత్రించాలని కోరారు. క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగా ఏ పంట ఎన్ని రోజులకు కోత దశకు వస్తుందో వ్యవసాయ శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉన్నందున దానికి తగినట్టు కోతలు నిర్వహించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఏవో అనురాధ, డీటీవో శోభన్‌బాబు, సీఎస్ డీఎం సంధ్యారాణి, డీఎస్‌వో కిష్టయ్య, డీసీవో నీరజ, మార్కెటింగ్ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

# గాలివానకు నేలవాలిన మక్కజొన్న పంట


చెన్నారావుపేట: కోనాపురంలో గాలివానకు నేలవాలిన మక్కజొన్న పంట

చెన్నారావుపేట/ఖానాపురం, ఏప్రిల్ 10: నర్సంపేట నియోజకవర్గంలో గాలివానకు మక్కజొన్న పంట నేలవాలింది. చెన్నారావుపేట మండలంలోని కోనాపురానికి చెందిన నాగనబోయిన కైలాసం తన రెండెకరాల భూమిలో మక్కజొన్న పంట సాగు చేశాడు. చేతికందే దశంలో గాలివాన బీభత్సానికి నేలవాలిందని వాపోయారు. అలాగే, వరి పంట కూడా దెబ్బతిన్నది. ఖానాపురం మండలంలోని మనుబోతులగడ్డ, బండమీదిమామిడి తండాలో 150 ఎకరాల్లో మక్కజొన్న పంట నేలవాలింది. పాకాల ఆయకట్టులో వరి పంట పాలుపోసుకునే దశలో ఉంది. ఈ సమయంలో ఈదరుగాలులతో కూడిన వడగళ్ల వాన కురవడంతో పంట సుంకు మొత్తం రాలిపోయింది. ఒక్కరోజులోనే వేలాది ఎకరాల్లో వరి గొలుసులు తెల్లబడి తాలుగా మారిపోయాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE



★Jangaon DTCP Open Plots Reasonable Price, Clear Title, Prime Location by: SSVPD'S. 7382126789.
NT-329249

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## బైక్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చి..

కరీమాబాద్, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. పోలీసుల కథనం ప్రకారం... నెక్కొండ మండలం సాయిపెడ్డిపల్లికి చెందిన వెంకటేశ్వర్లు(60) గురువారం కొత్త ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ కోసం రంగశాయిపేటలోని రవాణా శాఖ కార్యాలయానికి వచ్చాడు. అనంతరం ఉర్సు బైపాస్ రోడ్డులో వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### తల్లి మృతితో కొడుకుపై కేసు

పర్వతగిరి, ఏప్రిల్ 10: మండలంలోని కొంకపాక శివారు గుడితండాకు చెందిన భూక్యా రంగమ్మ(65)ను పెద్దకొడుకు రవి అలియాస్ దేవుడు మార్చి 28న కొట్టడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆమె చిన్న కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

### రైతులకు మేలు చేసేందుకే పొలంబాట

రాయపర్తి, ఏప్రిల్ 10: రైతులకు మేలు చేసేందుకే పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్ తెలిపారు. గురువారం మండలంలోని కాట్రపల్లిలో అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను లిఖితపూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

### నల్లబెల్లం విక్రయదారుడికి జరిమానా

నర్సంపేట, ఏప్రిల్ 10: పట్టణంలో సారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల విక్రేతకు నర్సంపేట ఎక్సైజ్ పోలీసులు భారీగా జరిమానా విధించారు. పాకాటరోడ్డులోని సంతోషిమాత కిరాణంలో ముడి పదార్థాలు విక్రయిస్తున్నాడనే సమాచారంతో నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 కిలోల చక్కెర, 80 కిలోల బెల్లం, 20 కిలోల పటిక, 40 డ్రై ఈస్ట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని మల్యాల మధుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడికి రూ. 60 వేల జరిమానా విధించారు.

# ఎకరానికి రూ. 25 వేలు అందించాలి

- ‘దొంతి’ దెబ్బ తిన్న పంటలను పరిశీలించకపోవడం దురదృష్టకరం
- రెండు రోజుల్లో సర్వే చేయకపోతే ఆందోళనలు చేస్తాం
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

పాకాల ఆయకట్టులో దెబ్బతిన్న పంటలు పరిశీలన

ఖానాపురం, ఏప్రిల్ 10: వడగళ్ల వాన, బలమైన ఈదురుగాలులకు పాకాల ఆయకట్టులో దెబ్బతిన్న అన్ని రకాల పంటలను ప్రభుత్వం వెంటనే సర్వే చేసి, ఎకరానికి రూ. 25 వేల పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి పాకాల ఆయకట్టులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. మూడు రోజుల్లో రెండుసార్లు కురిసిన వడగళ్ల వానకు పాకాల ఆయకట్టులో వేలాది ఎకరాల్లో వరి, మక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నదని పెద్ది ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట పాలుపోసుకునే దశలో బలమైన ఈదురుగాలులు, వడగళ్ల వానకు సుంకు రాలిపోయి గింజ తెల్లబడిపోయి తాలుగా మారిందన్నారు. అదేవిధంగా మక్కజొన్న పంట మొత్తం


ఖానాపురం శివారు పాకాల ఆయకట్టులో వడగళ్ల వానకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ధ్వంసమైందన్నారు.

**రైతు భరోసా ఇవ్వని ప్రభుత్వం**

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోయినా రైతులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకొని పంటలు సాగు చేశారని పెద్ది అన్నారు. పంట చేతికొచ్చే దశలో ఇటీవల కురిసిన వడగళ్ల వాన తీవ్ర నష్టాన్ని కలిగించిందని, అన్నదాతకు కన్నీళ్లు మిగిల్చిందని సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో జరిగిన నష్టం పూడ్చలేనిదైనా భరోసా, మనోధైర్యం కల్పించేందుకైనా, వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకైనా ఇన్‌పుట్ సబ్సిడీ పేరున నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం అందించాలని కోరారు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, వెంటనే వ్యవసాయ శాఖను అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన దెబ్బతిన్న పంటల సర్వే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వడగళ్ల వానతో మూడు రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, అధికారులు స్పందించకపోవడం, క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించకపోవడం దురదృష్టకరమన్నారు. రెండు వేల ఎకరాల్లో వందశాతం, వేలాది ఎకరాల్లో 80 శాతానికి పైగా పంటలకు నష్టం జరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వేజళ్ల కిషన్‌రావు, మస్తాన్, ఆబోత్ అశోక్, వడ్డె రాజశేఖర్, మచ్చిక అశోక్, బోడ పూలు, బాలు, సోమయ్య పాల్గొన్నారు.


నర్సయ్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

## మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం

రాయపర్తి, ఏప్రిల్ 10: మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన ల్యాదెళ్ల నర్సయ్య ఇటీవల పాము కాటుకు గురై హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన నర్సయ్యను ఆదుకునేందుకు మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, చేరికల మండల కన్వీనర్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని ప్రతినిధులు లేతాకుల రంగారెడ్డి, అయిత రాంచందర్, చినపాక భద్రయ్యతో అందజేశారు.

## మల్బరీ సాగుతో అధిక లాభాలు

గీసుగొండ, ఏప్రిల్ 10 : మల్బరీ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని పట్టుపరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకులు అనసూయ సూచించారు. మండలంలోని గంగదేవిపల్లిలో గీసుగొండ, నర్సంపేట, దుగ్గొండి, వరంగల్ మండలాల రైతులకు పట్టుసాగుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెట్‌లో మల్బరీకి అత్యధికంగా డిమాండ్ ఉందన్నారు. పట్టుపురుగుల పెంపకం షెడ్‌తోపాటు మొక్కలు, స్టాండ్లు సూమారు రూ. 4 లక్షల మెటీరియల్‌ను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో అధికారులు అరవింద్, షోయబ్ ఖాన్ పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి యువకుడి మృతి

చెన్నారావుపేట, ఏప్రిల్ 10: నీటి సంపులో పడి యువకుడు మృతి చెందిన ఘటన తిమ్మరాయిన్‌పహాడ్‌లో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి రమేశ్(30) ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. గురువారం ప్రమాదవశాత్తు ఇంటి సమీపంలోని నీటి సంపులో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట దవాఖానకు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

## ‘పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి’

నర్సంపేట, ఏప్రిల్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ స్వీపర్ల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణిని బీఆర్టీయూ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 9 నెలలుగా వేతనాలు అందించడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా నాయకులు కొల్లూరి లక్ష్మీనారాయణ, నాయకులు గొర్రె విజయ, రమాదేవి, లక్ష్మి, మౌనిక, రజిత, అనిత, విజయ, రేణుక పాల్గొన్నారు.

## తూర్పుకోటలో ఉచిత వైద్య శిబిరం

ఖిలావరంగల్, ఏప్రిల్ 10: వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోట పోచమ్మ ఆలయం వద్ద ఖిలావరంగల్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ ప్రారంభించారు. వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధా, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి టేబుళ్ల అందజేత

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: వరంగల్ ములుగు రోడ్డులోని స్వయంకృషి మహిళా వృద్ధాశ్రమానికి ‘మనం స్వచ్ఛంద సంస్థ’ వృద్ధుల కోసం ఐదు టేబుళ్లను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గోళ్ళ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వృద్ధాశ్రమంలో వృద్ధుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంస్థ ద్వారా బల్లలను పంపిణీ చేశామని తెలిపారు. బండి శ్రవణ్‌కుమార్, కానిస్టేబుల్ కన్నె రాజు సహకారంతో వాటిని సమకూర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చింత ప్రసాద్, శైలేష్, నాగరాజు పాల్గొన్నారు.

## ‘మహాసభలను జయప్రదం చేయాలి’

గీసుగొండ, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఆదివాసీ మహాసభలను జయప్రదం చేయాలని ఆదివాసీ తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకలో మహాసభల ప్రచార వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, లక్ష్మీనారాయణ, రాజేందర్, సాంబయ్య, సదానందం, శరత్‌బాబు, రవి పాల్గొన్నారు.

## గుడిసె వాసుల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట, ఏప్రిల్ 10: గుడిసె వాసుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి కోట డేవిడ్ అన్నారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెస్పీ, డీబీఆర్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ నగర్ గుడిసె వాసుల కాలనీలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు విజయ్, కాలనీవాసులు విజయ, రమ, జ్యోతి, వసంత, మల్లికాంబ, రఘు, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

# జిల్లాలో పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు

**రెండు మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ**

ఖిలావరంగల్, ఏప్రిల్ 10: జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి ఆరంభంలో 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉండాల్సిన ఉష్ణోగ్రతలు 35 నుంచి 39 మధ్య నమోదయ్యాయి. అలాగే, నాలుగు రోజులుగా జిల్లా వాతావరణంలో హెచ్చుతగ్గులు మొదలయ్యాయి. పగలు ఎండలు, సాయంత్రం వడగాలులు, వడగండ్ల వానలు కురుస్తున్నాయి. గురువారం జిల్లాలోని గీసుగొండ మండలం గొర్రెకుంటలో గరిష్టంగా 40.2 డిగ్రీలు, ఖిలావరంగల్ మండలంలో ఉర్సులో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే, దుగ్గొండిలో 39.9 డిగ్రీలు, వరంగల్ కాశీబుగ్గలో 39.8 డిగ్రీలు, పైడిపల్లిలో 39.6 డిగ్రీలు, ఖానాపురం మండలం మంగళవారిపేటలో 39.4 డిగ్రీలు, పర్వతగిరి మండలం కల్లెడలో 39.3 డిగ్రీలు, చెన్నారావుపేటలో 39.2 డిగ్రీలు, నెక్కొండ, నల్లబెల్లి, రాయపర్తి, నర్సంపేట మండలాల్లో 39.0 డిగ్రీలు, వర్ధన్నపేటలో 38 డిగ్రీలు, సంగెంలో మండలంలో 37.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

కరీమాబాద్, ఏప్రిల్ 10: పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఖిలావరంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్ గురువారం తనిఖీ చేశారు. స్లాట్ బుకింగ్ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం భూ యజమానులకు డాక్యుమెంట్లు అందజేశారు. మొదటి రోజు 30 మంది స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సకాలంలో రిజిస్ట్రేషన్లు**

పోచమ్మమైదాన్: పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ప్రారంభమైంది. గతంలో క్రయ, విక్రయదారులు గంటల తరబడి వేచి ఉండేవారు. ఇప్పుడు నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా పోచమ్మమైదాన్‌లోని


పత్రాలు అందజేస్తున్న రిజిస్ట్రార్ ఫణీందర్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 39 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. ఇందులో 36 మంది మాత్రమే వారికి కేటాయించిన సమయం ప్రకారం వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల సమయంలో కూడా ప్రత్యేకంగా స్లాట్ బుకింగ్ చేసుకున్న ఐదుగురికి అవకాశం ఉండగా, ముగ్గురు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా వచ్చిన వారికి సుమారు 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగించి, పత్రాలు ఇస్తున్నామని సబ్ రిజిస్ట్రార్ బి.సిద్దులునాయక్ తెలిపారు.

# మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలో అరాచకాలు

కరీమాబాద్, ఏప్రిల్ 10: మిల్స్‌కాలనీ పోలీ స్టేషన్ పరిధిలో అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో కొందరు రోడ్డుపై సంబురాలు చేసుకుంటున్నారు. అదే కాలనీకి సమీపంలో ఉండే ఖాసీం కారులో అటువైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న వారిని కొంచం జరగాలని కోరాడు. దీంతో కొందరు వ్యక్తులు కారులో ఉన్న ఖాసీంను ఇనుపరాడుతో కొట్టాడు. గాయపడిన అతడిని ఆసుపత్రికి వెళ్లి చికిత్స అందించారు. ఖాసీం ఇప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సైతం కేసు నమోదు చేయలేదు. అయితే, దాడి చేసిన వారు బెదింపులకు పాల్పడడంతో ఖాసీం ఫిర్యాదు చేయలేదని కొందరు తెలపగా.. ఈ విషయంలో పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియలేదు. ఖా సీం నుంచి రక్తం కారుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మిల్స్‌కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నంను వివరణ కోరగా.. బాధితుడు ఫిర్యాదు చేయలేదన్నారు. వీడియోను సుమోటోగా తీసుకుని నిందితులపై కేసు నమోదు చేస్తామన్నారు.

# కవులు కష్టజీవుల పక్షాన నిలిచి చైతన్యం చేయాలి


**కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్**


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అపంశయ్య నవీన్

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: భారత స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో బ్రిటీష్ వలసవాద దోపిడీకి, అణచివేతకు వ్యతిరేకంగా తమ కలాలను ఎక్కుపెట్టి ప్రజలను చైతన్యం చేయడానికి కవులు కష్టజీవుల పక్షాన ఉన్నారని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం(అరసం) 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ఆదర్శ న్యాయ కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి అధ్యక్షతన బుధవారం రాత్రి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 9న లక్నోలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడి నేటికి 90 వసంతాలు పూర్తయిందన్నారు. అలాగే, అరసం పునాదులు లండన్‌లో పడ్డాయని, గోపీచంద్, తాపీ ధర్మారావు వంటి వాళ్లు ఇందులో పనిచేశారని గుర్తుచేశారు. ఇప్పటికీ అభ్యుదయ కవిత్వం సమాజంలో సజీవంగానే ఉందని, కవి ఎప్పటికీ కష్టజీవి పక్షాన్నే ఉంటూ, తమ కవిత్వాన్ని ప్రజల భాషలోనే ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కవి పల్లేరు వీరస్వామి రచించిన వీక్షనాలు, కేవీఎల్ రచించిన కామ్రేడ్ లింగమ్మ పుస్తకాలను ఆవిష్కరించారు. సమావేశంలో ప్రముఖ కవి, విమర్శకులు ఆచార్య బన్న ఐలయ్య, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఉపాధ్యక్షురాలు చందనాలు సుమిత్ర, ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత, నిధి, బూర భిక్షపతి, బూర విద్యాసాగర్, డాక్టర్ పాంచాల్ ప్రసంగించారు. న్యాయవాది ఏరుకొండ జయశంకర్, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, రామబ్రహ్మం, వెంగల్‌రెడ్డి, కోడెం కుమారస్వామి, డాక్టర్ వెంకటి, కాసర్ల రంగారావు, బండి సూర్యనారాయణ, వెంకటయ్య, గుడికందుల ప్రకాశ్, గజ్జెల స్వరూప, మంజుల పాల్గొన్నారు.

# సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి: ఎస్సై

దుగ్గొండి, ఏప్రిల్ 10: వేసవి సెలవుల్లో విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా స్నేహితులతో కలిసి బావులు, చెరువుల వద్దకు వెళ్లొద్దని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. రానున్న వేసవి సెలవుల్లో తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చెదోడువాదోడుగా ఉండాలని, సోషల్ మీడియా, ఆన్‌లైన్ వీడియో గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ఎంతో నైపుణ్యంతో సమాజంలో రాణిస్తారని, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హెచ్ఎం ఎ.రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

కాశీబుగ్గ, ఏప్రిల్ 10: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ఇస్తున్నట్లు కార్యదర్శి జి రెడ్యా తెలిపారు. 12 నుంచి 14వ తేదీ వరకు సెలవులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి తిరిగి మంగళవారం సరుకులు మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఉమారాణి

## పంట నష్టంపై ప్రాథమిక సర్వే పూర్తి

నర్సంపేట, ఏప్రిల్ 10: నర్సంపేట డివిజన్‌లో పంట నష్టంపై ప్రాథమిక సర్వే పూర్తి చేసినట్లు నర్సంపేట ఆర్డీవో పి.ఉమారాణి తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. నల్లబెల్లి మండలంలో 10 ఎకరాల్లో వరి, 70 ఎకరాల్లో మక్కజొన్న, ఖానాపురం మండలంలో 140 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మక్కజొన్న పంటలకు నష్టం జరిగిందన్నారు. నర్సంపేట డివిజన్ పరిధిలో 150 ఎకరాల్లో వరి, 92 ఎకరాల్లో మక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. పూర్తిస్థాయిలో అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. సమీక్షలో నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఏవోలు పాల్గొన్నారు.


రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది స్వప్న

## బాధితులకు పెద్ది స్వప్న పరామర్శ

నర్సంపేట, ఏప్రిల్ 10: పట్టణంలో పలు బాధిత కుటుంబాలను జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న పరామర్శించారు. పట్టణంలోని 16వ వార్డు మాజీ కౌన్సిలర్ వేల్పుగొండ పద్మ భర్త, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు వేల్పుగొండ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం పెద్ది స్వప్న బాధితుల ఇంటికి వెళ్లి రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి మామ మల్లాడి శ్యామ్‌సుందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి పెద్ది స్వప్న పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట ఆర్‌బీఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, నాయకులు ఉన్నారు.


మాట్లాడుతున్న హెచ్ఆర్ సుచిత్ర

## కుట్టుశిక్షణ తరగతులు ప్రారంభం

సంగెం, ఏప్రిల్ 10: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన కుటుంబాలకు యంగ్‌వన్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం కుట్టుశిక్షణ తరగతులను హెచ్ఆర్ సుచిత్ర ప్రారంభించారు. మండలకేంద్రంలోని శాంతి మండల సమాఖ్య భవన్‌లో ద్వితీయ బ్యాచ్ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కుట్టుశిక్షణకు వచ్చిన అభ్యర్థులు బాగా నేర్చుకోవాలని సూచించారు. రెండు మూడు నెలల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాంతి మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్నె కల్యాణి, ఏపీఎం డి.కిషన్, ట్రైనర్ హేమలత, రాధిక, సీసీలు బొజ్జ సురేశ్, కుమారస్వామి, రాజయ్య, కృష్ణమూర్తి, కృష్ణ, సుజాత పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న మహిళలు

## వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ ధర్నా

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సీపీఎం కాశీబుగ్గ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఎంహెచ్‌నగర్ చౌరస్తాలో గురువారం గ్యాస్ సిలిండర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా కార్యదర్శి ఎండీ బషీర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ పెట్రో ధరలను ఇష్టమొచ్చినట్లు పెంచుతూ పేదల నడ్డి విరుస్తోందని ధ్వజమెత్తారు. ధరలు తగ్గించే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దార రమాదేవి, కోడూరు రజిత, ఎండీ షాషినాష్, బూర ఉమ, గొల్లపల్లి లక్ష్మి, సరోజన, భాగ్యమ్మ, విజయ, హైమా పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాయపర్తి, ఏప్రిల్ 10: మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం, కొండూరు, జింకురాంతండా, కాట్రపల్లి, కిష్టాపురం, మొరిపిరాల, మైలారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఏవో గుమ్మడి వీరభద్రం, ఎంపీవో కూచన ప్రకాశ్, ఐకేపీ ఏపీఎం రాపాక కిరణ్‌కుమార్‌తో కలిసి ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. ఐకేపీ సీసీలు చెవ్వు యాదగిరి, చీపురు దేవేంద్ర, వినోద, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## నకిలీ నేత్ర వైద్యుడిపై కేసు

కరీమాబాద్, ఏప్రిల్ 10: ఆప్టోమెట్రి సహాయకుడిగా ఉండి సరైన వైద్య విద్యా అర్హతలు లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డెక్కల్ ఆప్టికల్స్ యజమాని జనార్దన్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ లాలయ్య కుమార్, చైర్మన్ మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. వరంగల్ జేపీఎన్ రోడ్డులో జనార్దన్ కంటి వైద్యుడి అవతారమెత్తి ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు తనిఖీల్లో గుర్తించారు. నకిలీ వైద్యులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సూచించింది. అర్హత లేకుండా వైద్య వృత్తిని ప్రాక్టీసు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని సైతం వారు తెలిపారు.

## స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి

సంగెం, ఏప్రిల్ 10: కేంద్రం స్వామినాథన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ అన్నారు. కాపులకనపర్తిలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ విధానాల వల్ల వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటున్నదని దుయ్యబట్టారు. అనేక మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రాజయ్య, అంశాల రెడ్డి, పేరయ్య, రాజిరెడ్డి, రాజగోపాల్, బషీర్, మల్లేశం పాల్గొన్నారు.